జీపీ కార్మికుల జీతాల కోసం పోరాడుతాం

హుజూరాబాద్ టౌన్, మార్చి 16 : పంచాయతీ కార్మికుల జీతాల కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించకుంటే మరో పోరాటానికి సిద్ధమవుతామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినప్పటికీ, గ్రామ పంచాయతీ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. గత ఆరు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ యూనియన్ మండల గౌరవాధ్యక్షులు కొమురయ్య, ఉపాధ్యక్షులు ఆకునూరి సుధాకర్, నాయకులు మొగిలి, అవినాష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

రాఘవాచారి(ఫైల్)

చొప్పదండి, మార్చి16 : మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన గోగుల కొండ రాఘవాచారి(54) అప్పుల బాధతో పది రోజుల కిందట ఆత్మహత్యకు యత్నించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్ఐ అనూష తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవాచారి ఈ నెల 5న పురుగుల మందు తాగగా, చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తీసుకెళ్లగా, ఇటీవలే డిశ్చార్జ్ చేశారు. మళ్లీ ఆరోగ్యం క్షీణించడంతో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో పరిస్థితి విషమించి మృతిచెందాడు. రాఘవాచారి ఏడాది కిందట ఇల్లు నిర్మాణం కోసం రూ.20 లక్షల వరకు అప్పు చేశాడని, అతని వెల్డింగ్ షాపుసరిగా నడవనందున అప్పులు ఎక్కువై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలపారు. మృతుడికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపారు.

శ్రీ వ్రింద దవాఖాన ప్రారంభం

విద్యానగర్, మార్చి 16 : కరీంనగర్‌లోని మంకమ్మతోటలో ఏర్పాటు చేసిన శ్రీవ్రింద మల్టీ స్పెషాలిటీ దవాఖానను ఆదివారం మేనేజింగ్ డైరెక్టర్ వొల్లాల శంకర్, వైద్యులు వొల్లాల శ్రావణ్ కుమార్, వొల్లాల సుమ భార్గవి ప్రారంభించారు. అభివృద్ధి చెందుతున్న కరీంనగర్‌లో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎనమల నరేశ్, ఫిజీషియన్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ విజయ మోహన్‌రెడ్డి, తానా అధ్యక్షుడు డాక్టర్ పీ కిషన్, కోశాధికారి డాక్టర్ విజయ్, సీనియర్ వైద్యులున్నారు.

బ్రిడ్జిపై పురుగులొస్తున్నయ్.. జాగ్రత్త!

తిమ్మాపూర్, మార్చి16 : అలుగునూర్ శివారులోని కాకతీయ కాలువపై గల బ్రిడ్జిపై పురుగులు మళ్లీ స్వైర విహారం చేస్తున్నాయి. గత మూడు, నాలుగు ఏండ్లుగా కాకతీయ కెనాల్ నుంచి నీళ్లు వెళ్తున్న సమయంలో మార్చి నెలలోనే తరచుగా వస్తున్నాయి. ఈ పురుగులు వాహనదారుల కళ్లలో పడి, కార్ల అద్దాలకు అతుక్కుని ప్రమాదాలు జరిగాయి. వీటి కారణంగా పలువురు కెనాల్‌లోకి దూసుకెళ్లి మరణించగా, మరికొందరు ప్రమాదం బారిన పడి గాయపడ్డారు. గతంలో ఈ పురుగులను మళ్లించడానికి కాకతీయ కెనాల్‌కు ఇరువైపులా భారీ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వారం రోజుల నుంచి పురుగుల రాక మళ్లీ మొదలవగా, ప్రమాదాలు జరగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని ఎస్ఐ టీ వివేక్ సూచించారు.

పన్నుల వసూళ్లు అంతంతే..!

- అవగాహన లేక వెనుకబాటు
- కీలక సమయంలో బదిలీలతో తడబాటు
- ఇప్పటికి వచ్చింది 55 శాతమే..

కార్పొరేషన్, మార్చి 16 : మున్సిపాలిటీలకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తి పన్నులు.. ఇవి ఆర్థిక సంవత్సరం ముగింపు నెలలైన ఫిబ్రవరి, మార్చిలోనే భారీగా వసూలవుతాయి. ప్రతి ఏటా పన్నుల వసూళ్లలో కరీంనగర్ నగరపాలక సంస్థ రాష్ట్రంలో ముందు వరుసలో ఉంటుంది. కానీ, ఈసారి వెనుకబడి పోయింది. మరో 14 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగింపునకు వస్తున్నా 55 శాతం మేరకే వసూలవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. ముఖ్యంగా నగరపాలక ఉన్నతాధికారులు సమయం కాని సమయంలో చేపట్టిన చర్యల వల్లే వెనుకబడి పోయిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా నగరపాలక సంస్థలో ఇప్పటి వరకు ఆయా రెవెన్యూ బ్లాక్‌ల వారీగా బిల్ కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు రోజువారీగా లక్ష్యాలు నిర్దేశించి వసూలు చేసేవారు. కానీ, ఈసారి మాత్రం ఉన్నతాధికారులు చేపట్టిన బదిలీలు కాస్తా పన్నుల వసూళ్లకు అడ్డంకిగా మారాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కసారిగా తీసుకువచ్చిన మార్పులతో ఆయా సిబ్బందికి అవగాహన లేకపోవడం.. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులెవరూ పర్యవేక్షణ చేయకపోవడంతో వసూళ్ల శాతం తక్కువగా వస్తుందన్న విమర్శలు వస్తున్నాయి.

వార్డు ఆఫీసర్లకు బాధ్యతలు.. అవగాహన లేమి

గతంలో రెవెన్యూ బ్లాక్‌ల వారీగా బిల్ కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పని చేయగా.. ఆ విధానాన్ని పూర్తిగా ఎత్తివేశారు. కొత్తగా డివిజన్ల వారీగా వార్డు ఆఫీసర్లను నియమించి వారికి ఆస్తి పన్నుల వసూళ్ల బాధ్యతలు ఇచ్చారు. అయితే, వారికి ఆయా డివిజన్లపై అవగాహన లేకపోవడంతో వసూళ్ల విషయంలో ప్రభావం చూపుతున్నది. ఏ ఇంటి నంబర్ ఏయే డివిజన్ పరిధిలోకి వస్తుంది?, ఆయా ఇంటి నంబర్లు ఏ ప్రాంతంలో ఉంటాయి? అనే విషయం తెలుసుకునేందుకే ఆయా ఉద్యోగులకు సమయం గడిచిపోతుందన్న వాదనలు వస్తున్నాయి. అలాగే, వార్డు ఆఫీసర్లందరూ నగరపాలక సంస్థ కార్యాలయంలో తమ బయోమెట్రిక్ ద్వారా హాజరు వేసుకున్న తర్వాతే క్షేత్రస్థాయిలోకి వెళ్తున్నారు. దీంతో ఆయా ఇంటి యజమానులు తమ పనుల కోసం బయటకు వెళ్లడం కూడా పన్నుల వసూళ్లపై ప్రభావం చూపుతుందన్న వాదనలు వస్తున్నాయి.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువు

పన్నులు వసూళ్లు చేయాలంటూ ప్రతి రోజూ సమీక్షలు నిర్వహిస్తున్న ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వసూళ్ల విషయంలో పర్యవేక్షణ చేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రాలు క్షేత్రస్థాయిలో ఉద్యోగులు పర్యటిస్తేనే పన్నులు వసూలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కానీ ఆ సమయంలో సమీక్షల పేరుతో సమావేశాలు నిర్వహించడం కూడా వసూళ్లపై ప్రభావం చూపుతుందని ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత బదిలీలు చేపడితే ఆయా ఉద్యోగులకు కూడా ఆయా డివిజన్లపై అవగహన వచ్చేందుకు సమయం ఉండేదన్న అభిప్రాయాలు వస్తున్నాయి. ఆస్తి పన్నుల ద్వారా రూ.52.92 కోట్ల మేరకు డిమాండ్ ఉండగా, ఇప్పటి వరకు 55 శాతం మేరకు వసూలు చేశారు. జిల్లాలోని హుజూరాబాద్ మున్సిపాలిటీ 96 శాతానికి పైగా పన్నుల వసూళ్లతో రాష్ట్రంలోనే టాప్ ప్లేస్‌లో ఉండగా... నగరపాలక సంస్థ మాత్రం కింది స్థాయికి పడిపోయింది.

వృథాగా సులభ్ కాంప్లెక్స్

చొప్పదండి, మార్చి 16 : చొప్పదండి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రూ.9.50 లక్షల మున్సిపల్ నిధులతో నిర్మించ్చిన మోడ్రన్ సులభ్ కాంప్లెక్స్ నిర్మించి ఏళ్లు గడుస్తున్నా వృథాగా ఉంటోంది. ప్రధాన కూడలిలో ఉన్న ఈ సులభ్ కాంప్లెక్స్‌లోని డోర్లు, రేకులు ఎక్కడికక్కడ ఊడిపోయాయి. అదే కాంప్లెక్స్ ముందు భాగంలో రెండు పెట్టర్లను అద్దెకు ఇవ్వాలని నిర్ణయించుకున్నప్పటికీ అవి దేనికీ పనికి రాకుండా పోతున్నాయి. వీటి విషయంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఒకవైపు పట్టణానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు ఒంటికి, రెంటికి సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతుంటే.. ఇలా నిర్మాణం పూర్తయిన వాటిని ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

వృద్ధురాలి దారుణహత్య

కొత్తపల్లి, మార్చి 16 : తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు తనుకు వెంకటమ్మ(70)ను గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి దారుణంగా హత్యచేశారు. కరీంనగర్ రూరల్ పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. కరీంనగర్ శివారులోని కొత్తపల్లి నుంచి దేశరాజుపల్లి వెళ్లే రోడ్డు మార్గంలో ఎస్సారెస్పీ కెనాల్ వద్ద గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం రక్తపు మడుగులో ఉన్నట్లు ఆ వైపు వెళ్లేవారు కొత్తపల్లి పోలీసులకు సమాచారం అందించారు. కరీంనగర్ రూరల్ పోలీసులతోపాటు కొత్తపల్లి పోలీసులు అక్కడికి చేరుకుని వృద్ధురాలు హత్యకు గురైనట్లు గుర్తించి, వెంకటమ్మగా తేల్చారు. మృతురాలు వెంకటమ్మ తన పెద్ద కూతురైన సిద్దిపేట జిల్లా కోహెడ మండలం రామచంద్రాపూర్‌లో ఉండే లక్ష్మి వద్దకు వెళ్లి ఆదివారం ఉదయం కరీంనగర్‌కు వస్తూ హత్యకు గురైనట్లు పోలీసుల విచారణలో తేలింది. వృద్ధురాలికి చెందిన ఎల్ఐసీ డబ్బుల విషయమై కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతుండగా పోలీసులు వారిపై అనుమానంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

ప్రాణం తీసిన ప్రేమ భయం

గోలేటి శ్వేత,

మెనుగు రాహుల్ (ఫైల్)

జమ్మికుంట (హుజూరాబాద్), మార్చి 16: వారి ప్రేమను కుటుంబ సభ్యులు ఒప్పుకోరని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని పాపయ్యపల్లి శివారులోని రైల్వే ట్రాక్‌పై అనుమానాస్పదంగా పడి ఉన్న యువతీయువకుల మృతదేహాలకు సంబంధించిన వివరాలు ఆదివారం వెలుగులోకి వచ్చాయి. రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామానికి చెందిన మెనుగు రాహుల్(18) ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫెయిల్ కాగా, పని కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సోమారంపేట(ఎరువచింతల) గ్రామానికి చెందిన గోలేటి శ్వేత(20 కరీంనగర్‌లోని ప్రభుత్వ ఉమెన్స్ కాలేజీలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్నది. వీరిద్దరికీ కరీంనగర్‌లో జరిగిన ఓ ఈవెంట్‌లో పరిచయం ఏర్పడగా, అది కాస్త ప్రేమగా మారింది. ఇటీవలి శివరాత్రి పండుగకు ఇంటికి వెళ్లిన శ్వేత తిరిగి కరీంనగర్ కళాశాలకు చేరుకుంది. నాలుగు రోజుల క్రితం రాహుల్ సప్లిమెంటరీ ఎగ్జామ్ రాసి ఇంటి వద్దే ఉన్నాడు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాహుల్ అప్పటికే కరీంనగర్ నుంచి జమ్మికుంటకు వచ్చిన శ్వేత ఇద్దరూ కలుకుని, తమ ప్రేమ విషయం తెలిస్తే కుటుంబ సభ్యులు ఒప్పుకోరనే సున్నిత మనస్తత్వంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. జమ్మికుంట మండలంలోని పాపయ్యపల్లి శివారులో గల రైల్వే ట్రాక్‌పై ఆదివారం రాత్రి సుమారు 7:15 గంటలకు ఆత్మహత్యకు పాల్పడేందుకు సిద్ధపడ్డారు. గూడ్స్ డ్రైవర్ హారన్ మోగించినప్పటికీ లేవకుండా అలాగే పడుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సదరు డ్రైవర్ రైల్వే శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. తన కూతురు శివరాత్రికి ఇంటికి వచ్చి కాలేజీకి వెళ్లిందని, తమకు కూతురు ప్రేమకు సంబంధించిన విషయం కానీ, అబ్బాయి విషయం కానీ తెలియదని మృతురాలి తండ్రి గోలేటి రాజలింగం తెలిపారు. మృతుడి తండ్రి రాజు సైతం తనకు వివరాలు తెలియవని, తాను కూడా హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. ఇరు కుటుంబాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి పేర్కొన్నారు. కాగా, ఈ ఘటన రెండు కుటుంబాల్లో విషాదం నింపింది.

స్వామివారికి మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న పోలీసుల కుటుంబ సభ్యులు

రాణాకు నర్సన్న

దక్షిణ దిగ్యాత్రలో భాగంగా పోలీస్‌స్టేషన్‌లో స్వామివారికి పూజలు

ధర్మపురి, మార్చి 16: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగం గా ఆదివారం యోగ, ఉగ్ర లక్ష్మీనరసింహ స్వామివార్లకు పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. దక్షిణ దిగ్యాత్రలో భాగం గా దేవస్థానంలో పూజల తర్వాత సాయం త్రం ఉత్సవమూర్తులు సేవలపై మేళతాళాల మధ్య దక్షిణదిశలో గల పోలీస్‌స్టేషన్ వరకు శోభాయాత్రగా చేరుకున్నారు. డీఎస్పీ రఘుచందర్, సీఐలు రాంనర్సింహారెడ్డి, వేణుగోపాల్, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది స్వామివారి సేవలను భుజంపై మోసుకొచ్చారు. పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న స్వామివార్ల సేవలకు పోలీస్ కుటుంబాల మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఉత్సవమూర్తులను స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక పై ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బందిని, స్వామివారి సేవాకార్యక్రమాల్లో పాల్గొంటున్న పలువురిని శాలువాలతో సన్మానించారు. అనంతరం స్వామివార్ల ఉత్సవమూర్తులను దేవస్థానానికి శోభాయాత్రగా తీసుకెళ్లారు.

ఇకపై అప్పులు చేయను!

- ఆదాయం పెంచి, పంచుతా
- అప్పు చేసి తినే పప్పు కూడుతో రాష్ట్రానికి ముప్పు
- అప్పుల వల్లే పథకాలు అమలు చేయలేకపోతున్నా
- స్టేషన్ ఘన్‌పూర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే రికార్డుస్థాయిలో రూ.1.53 లక్షల కోట్లు అప్పులు చేసి, తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇకపై తాను అప్పులు చేయదలుచుకోలేదని స్టేషన్ ఘన్‌పూర్ సభ సాక్షిగా స్పష్టంచేశారు. అప్పుచేసి తినే పప్పు కూడు, అప్పు ఎప్పటికైనా రాష్ట్రానికి ముప్పేనని తాను స్పష్టంగా నిర్ణయించుకున్నట్టు వివరించారు. ఇకపై అప్పులు చేయబోనని, రాష్ట్ర ఆదాయం పెంచి, పేదలకు పంచుతానని పేర్కొన్నారు. అందరూ సహకరించాలని కోరారు.

2 లక్షల మాఫీ అందరికీ చేయలే...

రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించారు. గత ప్రభుత్వం అప్పులు చేయడం మూలంగా 15 నెలల పాలనలో రూ.1.53 లక్షల కోట్లు అసలు, మిత్తి చెల్లించామని ఆరోపించారు. ఆ మొత్తం నిధులు ఉంటే అర్హులైన 30 లక్షల మందికి రూ.5 లక్షల చొప్పున ఇచ్చి ఇండ్లను కట్టించేవాడినని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం జరిగిన బహిరంగ సభలో సీఎం పేర్కొన్నారు. 75 లక్షల మంది రైతులకు రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేసేవాడినని చెప్పారు. తాజా అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంలో, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటల్లోనూ రూ.2 లక్షల రుణమాఫీ పూర్తయిందని స్పష్టం చేసిన విషయం విదితమే.

ఆర్థిక నిపుణుల విస్మయం

సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆర్థిక నిపుణులు, రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి నెలకు రూ.10 వేల కోట్ల చొప్పున, ఈ 15 నెలల్లో రూ.1.53 లక్షల కోట్లు అప్పులు చేయడమే కాకుండా నీతులు వల్లించడం ఏమిటని చెప్తున్నారు. ఎన్నికలకు ముందు అప్పులపై నానా యాగీ చేసి, నేడు అప్పుల కోసం వెంపర్లాడంపై విమర్శలు చేస్తున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ హయాంలో తీసుకొచ్చిన అప్పులన్నీ అసలు, మిత్తిలకే కట్టామని అబద్ధాలు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గత బీఆర్ఎస్ సర్కారుపై అభాండాలు వేయడం సరికాదని హితవు పలుకుతున్నారు. ఆర్బీఐ డాటాను వారు గుర్తుచేస్తున్నారు.

ఈసారి రూ.లక్షన్నర కోట్ల అప్పు?

- ప్రభుత్వ బడ్జెట్ రుణాలు రూ.80 వేల కోట్లు
- రూ.40 వేల కోట్ల బడ్జెటేతర రుణాలు తీసుకునే ప్లాన్
- భూముల తనఖాతో 30 వేల కోట్లు సమీకరణకు ప్లాన్

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): 'మా ప్రభుత్వం ఇకపై అప్పులు చేయదలుచుకోలేదు' అని ఆదివారం వరంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినప్పటికీ అవన్నీ ఒట్టి మాటలేనని ఆర్థిక నిపుణులు కొట్టిపారేస్తున్నారు. సీఎం చేస్తున్న వ్యాఖ్యలకు, బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రణాళికలకు సంబంధమే లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు రూ.3.15 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే లీకులు ఇచ్చింది. ఇది నిరుటి బడ్జెట్ కంటే దాదాపు రూ.24 వేల కోట్లు ఎక్కువ. సాధారణంగా రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో సొంత పన్నులు, కేంద్ర పన్నుల్లో వాటా, పన్నేతర ఆదాయం బడ్జెట్‌లో ప్రధానాంశాలుగా ఉంటాయి. వీటితోపాటు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో తీసుకునే రుణాలను కలిపి రాష్ట్ర వార్షిక బడ్జెట్ అంచనాలను రూపొందిస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రుణాలు కాకుండా రెవెన్యూ రాబడులను రూ.2.21 లక్షల కోట్లుగా అంచనా వేశారు.

రూ.2 లక్షలలోపే బడ్జెట్ పెడతారా?

రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేయదలుచుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్న మాట నిజమే అయితే రెవెన్యూ రాబడుల ఆధారంగా మాత్రమే బడ్జెట్ రూపొందించాల్సి ఉంటుంది. ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో వచ్చే రుణాలను కూడా తీసుకోకూడదు. ఈ లెక్కన 2025-26 బడ్జెట్ రూ.2 లక్షల కోట్లలోపే ఉండాలి. భూముల తనఖా, విక్రయాల ద్వారా భారీగా నిధులను రాబట్టుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రూ.30 వేల కోట్ల వరకు సమీకరించుకోబోతున్నట్టు సమాచారం.

ప్రగతి సభలో సీఎంకు నిరసనసెగ

- రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తుండగా ఫ్లెక్సీ ప్రదర్శించిన మహిళలు
- సాంస్కృతిక సారథి ఉద్యోగాలుఇవ్వాలని డిమాండ్
- ఫ్లెక్సీ చింపేసిన పోలీసులు
- స్టేషన్ ఘన్‌పూర్‌లో సభలో కడియంకు రేవంత్ మద్దతు
- కాంగ్రెస్ ఇన్‌చార్జి గైర్హాజరు
- సీఎం సభలో చిన్న పిల్లలతో ర్యాప్ సాంగ్ డ్యాన్సులు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సభలో ఫ్లెక్సీలతో నిరసన తెలుపుతున్న మహిళలు

వరంగల్, మార్చి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/జనగామ చౌరస్తా: 'ప్రజాపాలన - ప్రగతి బాట' పేరిట జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నిరసన సెగ తలిగింది. మహిళా కళాకారులు తమ డిమాండ్ల సాధన కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా ఫ్లెక్సీ ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సాంస్కృతిక సారథిలో తమకు ఉద్యోగాలు ఇవ్వాలని గుర్తు చేశారు. ఆ ఫ్లెక్సీని చూసిన రేవంత్‌రెడ్డి అసహనానికి గురయ్యారు. ఫ్లెక్సీని చూశానని, ఇక దించాలని ఆదేశించారు. కళాకారులు కూర్చునేలోపు ఒక్కసారిగా పదుల సంఖ్యలో పోలీసులు వారిని చుట్టుముట్టారు. దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొన్నది. మహిళా కళాకారుల ఫోన్లు, ఫ్లెక్సీని పోలీసులు గుంజుకున్నారు. వారిని ఈడ్చుకుంటూ సభ నుంచి బయటికి తీసుకువెళ్లారు. కొందరు చంటి బిడ్డలతో రాగా.. ముఖ్యమంత్రి మెప్పు కోసం పోలీసులు వారితోనూ దురుసుగా ప్రవర్తించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తుచేసేందుకు ప్రయత్నిస్తే అమానుషంగా ప్రవర్తించారని కళాకారులు వాపోయారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తమకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అసలు కాంగ్రెస్ నేతల దూరం

బీఆర్ఎస్ తరఫున గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి మద్దతుగా రేవంత్‌రెడ్డి ఈ సభలో ప్రసంగించారు. స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలు కడియం శ్రీహరికి అండగా ఉండాలని కోరారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దవుతుందనే చర్చ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి విన్నపం ఉపఎన్నికలకు సంకేతమని సభకు వచ్చినవారు మాట్లాడుకున్నారు. ఈ సభకు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సింగారపు ఇందిర హాజరు కాలేదు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్న పదేండ్లు పార్టీ కోసం పనిచేసిన ఆమె ఈ సభకు దూరంగా ఉండటంపై కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. కడియం శ్రీహరి వచ్చిన తర్వాత మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారిని ఇబ్బంది పెడుతున్నారని ఇందిర ఇప్పటికే పీసీసీ, ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి పాల్గొన్న సభకు ఇందిర దూరంగా ఉండడంతో మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న ఓ వర్గం సైతం సభకు రాలేదు.

పిల్లలతో డ్యాన్సులు..

ఈ సభలో ముఖ్యమంత్రి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే, సీనియర్ ఐఏఎస్‌లు, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో పాఠశాల పిల్లలతో స్టేజీపై ర్యాప్ సాంగ్‌లకు డ్యాన్సులు వేయించడంపై విమర్శలు వస్తున్నాయి. మొదట సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించగా.. ఆ తర్వాత ఎండలోనూ చిన్న పిల్లలతో నృత్యం చేయించడంతో సభకు హాజరైనవారు ఆశ్చర్యపోయారు. అనంతరం పిల్లలతో ఏకంగా ర్యాప్ సాంగ్‌లకు డ్యాన్సులు చేయించారు. దాదాపు పదేండ్లు విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రభుత్వ సభలో చిన్న పిల్లలతో ఇలాంటి డ్యాన్సులు వేయించడంపై సభకు వచ్చినవారు, ముఖ్యంగా మహిళలు పెదవి విరిచారు.

రేవంత్ అన్న..?

కాంగ్రెస్‌లో ఫిరాయించిన కడియం శ్రీహరి పరిస్థితి ఆయన సహజ వైఖరికి భిన్నంగా ఉన్నదని బహిరంగ సభకు వచ్చిన వారు చర్చించుకున్నారు. కడియం శ్రీహరి ప్రసంగంలో ప్రతిసారి ముఖ్యమంత్రిని రేవంత్‌రెడ్డి అన్న అని సంబోధించారు. కడియం శ్రీహరి కంటే దాదాపు 17 ఏండ్లు చిన్న వయస్సు ఉన్న రేవంత్‌రెడ్డిని గతంలో ఎప్పుడూ లేని విధంగా అన్న, అన్న.. అని అనడం కొత్తగా ఉన్నదని... ఉప ఎన్నికలు వస్తాయనే ఆందోళనే దీనికి కారణమై ఉంటుందని సభకు వచ్చినవారు ముచ్చటించుకున్నారు.

గులాబీలతో ఇబ్బంది..

స్టేషన్ ఘన్‌పూర్ పర్యటనలో భాగంగా బహిరంగ సభకు ముందు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. వాటి నిర్వాహకులతో మాట్లాడారు. ప్రతి స్టాల్‌లోనూ నిర్వాహకులు ముఖ్యమంత్రికి ఆత్మీయంగా వారి ఉత్పత్తులతో పాటు గులాబీ పూలను ఇచ్చారు. దీంతో రేవంత్‌రెడ్డి కొంత అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ రంగు గులాబీ కావడంతో స్టాళ్లలో పూలు తీసుకోవడానికి ఆయన ఇబ్బంది పడినట్టు ఓ ఐఏఎస్ అధికారి పక్కనున్న వారితో అనడంతో అక్కడ ఉన్నవారు నవ్వుకున్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం: ఎమ్మెల్యే పల్లా

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా జనగామ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పాటు వివిధ పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం అప్రజాస్వామికమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ పిరికిపంద చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. అక్రమంగా అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొంటున్న కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత వస్తున్నదని, అసమర్థ పాలనపై ప్రశ్నిస్తారనే బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారని మండిపడ్డారు. సీఎం పర్యటన స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉంటే జనగామ నేతలను ఎందుకు అరెస్ట్ చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అక్రమ నిర్బంధాలతో నిరంకుశత్వాన్ని చాటుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హితవు పలికారు. ఈ మేరకు ఒక ప్రకటనలో పల్లా తెలిపారు. కాగా, జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టు



మాజీ డిప్యూటీ సీఎం రాజయ్యను గృహనిర్బంధం చేసిన పోలీసులు

సీఎం రేవంత్‌రెడ్డి జనగామ జిల్లా పర్యటన సందర్భంగా పోలీసులు ముందస్తుగా బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాజీ ఎమ్మెల్యే రాజయ్యను గృహ నిర్బంధంలో ఉంచారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో జిల్లాలో పంటలు ఎండిపోవడంతో సీఎం రేవంత్‌పై ఆగ్రహంగా ఉన్న రైతులు, నేతలు నిరసనలు తెలిపే అవకాశం ఉందన్న నిఘా వర్గాల సూచనల మేరకు శనివారం అర్ధరాత్రి నుంచి పోలీసులు అరెస్టులు మొదలుపెట్టారు. బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో పాటు బీజేపీ, సీపీఎం, టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేశారు. వారిని పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. సీఎం సభ ముగిసిన తర్వాత సాయంత్రం 4 గంటలకు విడిచిపెట్టారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు డిస్‌క్వాలిఫై అవుతారని, రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని మంత్రి రాజయ్య విమర్శించారు.

లక్షన్నర కోట్ల అప్పుతో ప్రజలకు ఒరిగిందేమిటి?

- కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపాటు



హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు ఎలాంటి ప్రణాళిక లేకుండా ఆరు గ్యారెంటీలను ప్రటించిన కాంగ్రెస్ పార్టీ.. వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే లక్షన్నర కోట్ల అప్పు చేసిందని దుయ్యబట్టారు. ఈ అప్పులతో ప్రజలకు ఒరిగిందేమిటి? రాష్ట్రంలో వచ్చిన మార్పు ఏమిటి? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓటమి నుంచి తప్పించుకునేందుకే తమిళనాడు సీఎం స్టాలిన్ రెండునెలలుగా వితండవాదం చేస్తున్నాడని విమర్శించారు.

రేవంత్.. ప్రజలే మీ బట్టలిప్పతరు

- సీఎంపై ఏలేటి విమర్శలు

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి జర్నలిస్టులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డికి బట్టలు ఊడదీసే ఫాంటసీ ఏంటో అర్థం కావడంలేదని చురకలంటించారు. అది చట్టసభలో ముఖ్యమంత్రి మాట్లాడే భాషేనా అని నిలదీశారు. "ప్రజలు మీ బట్టలు విప్పేందుకు రెడీ అయితున్నారు. ముందు దానిమీద దృష్టి పెట్టండి" అని హితవు పలికారు. బీజేఎల్పీ కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఏకపాత్రాభినయం చేస్తున్నారని విమర్శించారు. ఇది హామీల ఎగవేతల, సమాధానాల దాటవేతల ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. తాను గవర్నర్ ప్రసంగంపై ప్రశ్నిస్తే సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పకుండా దాటవేశారని, పసలేని జవాబులు చెప్పారని తీవ్రంగా మండిపడ్డారు.